క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న సుబ్బారావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెంకటగిరి బాపూజీనగర్‌లో సిద్ధూ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్(బొల్లినేని)హాస్పిటల్స్ సహకారంతో ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రూరల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు ప్రారంభించారు. కిమ్స్ వైద్య నిపుణులు 200 మంది రోగులకు ఈసీజీ, అవసరమైన వైద్యపరీక్షలు చేసి సిఫారసు చేసిన మందులను ఉచితంగా అందించారు. కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణరామ్మోహన్, బీఎంపీ రాష్ట్ర సంఘ గౌరవ సలహాదారు గౌరిష్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభువైన క్రీస్తు కృపతో నిర్విరామంగా ప్రజాసేవలో పాల్గొనడం ఆనందంగా ఉందని జాన్‌వెస్లీ ఫౌండేషన్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సుబ్బారావునగర్‌లో ఉన్న చర్చి ప్రాంగణంలో 100వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఇప్పటివరకు మెడికల్ క్యాంపుల ద్వారా సుమారు 20,000 మందికి ఉచితంగా వైద్యం అందించామన్నారు. ఫౌండేషన్ చైర్మన్ బ్లేస్సి వెస్లీ, జోసెఫ్ విజయ్‌కుమార్, సత్యా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సందీప్ మృతిపై విచారణ జరపాలి

కడియం: స్థానిక ఎంపీడీవో కె.రత్నకుమారి కుమారుడు మట్టా సందీప్ మృతిపై విచారణ జరపాలని జేగురుపాడు సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సందీప్ గ్యాస్ట్రో సంబంధిత చిన్నపాటి రోగంతోనే ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందడం విషాదమన్నారు. రాజమహేంద్రవరంలో వైద్యం వ్యాపారంగా మారిందని ఆరోపించారు.

ఉన్నతమైన వ్యక్తి తారకరత్న

సీటీఆర్ఐ: సినీ నటుడు నందమూరి తారకరత్న ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన తారకరత్న సంతాప సభ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. నాయకులు నివాళి అర్పించారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్ : విశాఖపట్నంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు రాజమహేంద్రవరం గాంధీ పార్కులో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జితేంద్ర కుమారస్వామి, అనిరుధ్, కెల్లా భవ్యశ్రీ ఎంపికైనట్లు కోచ్ రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రకాశం నగర్ : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కేత అప్పారావు పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సోమాలమ్మ గుడి సెంటర్లో కేత అప్పారావు కేత తులసమ్మల స్తూపాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కేత అప్పారావు దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని నిరంతరం చెప్పేవారని గుర్తు చేశారు .రాజమండ్రిలో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు జరిపించడంలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి, కోండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ పాల్గొన్నారు.

నేడు సీపీఐ పోలవరం పరిశీలన

ప్రకాశం నగర్ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి పోలవరం పరిశీలన యాత్ర చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ పోస్ట్ తొలగించాలి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధికార ట్విట్టర్ ఖాతాలో హిందువులను కించపరిచే విధంగా పోస్ట్ చేసిన చిత్రాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఆదివారం మధ్యాహ్నం క్వారీ సెంటర్ శివాలయంలో ఆందోళన చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

సురభికి జాతీయ సౌరభం

- భారత్ రంగ్ మహోత్సవంలో మెరిసిన ఏకైక తెలుగు నాటకం భక్త ప్రహ్లాద
- సెట్టింగ్‌లు, లైటింగ్, మ్యూజిక్‌తో రక్తి కట్టించిన సురభి కళాకారులు
- 102 జ్వరంతో ఉన్నా ప్రహ్లాదుడిగా నటించి, మెప్పించిన ఆరేళ్ల పర్ణిక



తండ్రి హిరణ్యకశిపుడు ఎదుట శ్రీహరిని కీర్తిస్తున్న ప్రహ్లాదుడు



హరిని కీర్తిస్తూ పద్యాన్ని ఆలపిస్తున్న ప్రహ్లాదుడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సురభి అంటేనే నాటకం... నాటకం అంటేనే సురభి అన్నంతగా పేరు సంపాదించుకుంది సురభి కుటుంబం. అందుకే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) ఆధ్వర్యంలో భారత్ రంగ్ మహోత్సవంలో ప్రదర్శనకు వారి నాటకం ఎంపికైంది. రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం నుంచి జరుగుతున్న థియేటర్ ఫెస్టివల్‌లో శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ గ్రూప్ హైదరాబాద్ వారు భక్త ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించారు.

నాలుగు వేల నాటకాలు వడపోత...

ఎన్ఎస్‌డీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి నాటక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ ఏడాది రాజమహేంద్రవరంలో నిర్వహణకు ఎన్ఎస్‌డీ సుముఖత తెలపడంతో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు వివిధ రాష్ట్రాల కళాకారుల నాటకాలు ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు వేల నాటకాలను ఎన్ఎస్‌డీ బృందం పరిశీలించి వాటిలో ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేస్తుంది. ఇప్పటి వరకు సురభి కళాకారులు తప్ప మరే ఇతర నాటక కంపెనీకి ఇటువంటి అవకాశం దక్కలేదు. తెలుగు వారి నాటకాలను సుమారు రెండువేల వరకు పరిశీలించి వాటిలో సురభి వారికి అవకాశం కల్పించారు.

ఇతర రాష్ట్రాల కళాకారులతో పోటీ ఎక్కువ

మన నాటకాలలో భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఇతర రాష్ట్రాల నాటకాలలో లైటింగ్, టెక్నికల్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. అందుకే వారితో తెలుగు నాటకం పోటీ పడలేకపోతోంది.

అలరించిన భక్త ప్రహ్లాద

సురభి జయచంద్ర దర్శకత్వంలో ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం వీక్షకులను అలరించింది. సెట్టింగ్‌లు, లైటింగ్, మ్యూజిక్‌తో నాటకాన్ని రక్తి కట్టించారు. నాటకం చూస్తున్నంత సేపు ప్రేక్షకులు వేరే లోకంలో విహరించారు. దర్శకుడిగానే కాకుండా హిరణ్యకశిపుడిగా నటించి సురభి జయచంద్ర మెప్పించారు. ప్రహ్లాదుడి పాత్రలో నటించిన పర్ణిక (ఆరు సంవత్సరాలు) 102 జ్వరంతో ఉన్నా తన నటనతో మంత్ర ముగ్ధులను చేసింది.

ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ డ్రామా అఫైర్స్ సంచాలకులు అభిలాస్ పిళ్ళై బెంగళూర్ ఎన్ఎస్‌డీ సెంటర్ డైరెక్టర్ వీణా శర్మ, ఏపీ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, రాజమహేంద్రవరం సెంటర్ ఇన్‌చార్జి భూపతి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, డిప్యూటీ డీఈఓ దిలీప్‌కుమార్, విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఐదువేల నాటకాలు ప్రదర్శించాను

సురభి వారసుడిగా నేను ఇప్పటి వరకు ఐదు వేల నాటకాలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. భారత్‌రంగ్ మహోత్సవాలలో మూడుసార్లు ప్రదర్శనలు ఇచ్చాను. ఏ తెలుగు నాటకం కూడా ఇప్పటి వరకు భారత్ రంగ్ మహోత్సవానికి ఎంపిక కాలేదు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ కేంద్ర సంగీత నాటక అవార్డును 2016లో అందుకున్నాను.

– సురభి జయచంద్ర వర్మ, దర్శకుడు, కళాకారుడు



చిన్నప్పటి నుంచీ నటిస్తున్నా

నేను నాలుగోయేట నుంచే నాటకాలలో నటిస్తున్నాను. ఇప్పటి వరకు 200 ప్రదర్శనలు ఇచ్చాను. ప్రహ్లాదుడిగా చాలాసార్లు నటించాను. మా నాన్న, అమ్మ, అందరూ నాకు రోజూ పద్యాలు నేర్పిస్తారు. మేకప్ వేసుకుంటే నాలో తెలియని ఉత్సాహం వస్తుంది.

– ఆర్.పర్ణిక వర్మ, ప్రహ్లాద పాత్రధారిణి



ఎంపీ భరత్‌ను కలిసిన కుడుపూడి



ఎంపీ భరత్‌రామ్, సూర్యనారాయణ, నాగేశ్వరరావును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్‌ను ఆదివారం ఆయన కార్యాలయంలో ఉభయ తెలుగురాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్, కుడిపూడి సూర్యనారాయణ, ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ మార్గాని నాగేశ్వరరావును గౌడ, శెట్టిబలిజ సంఘ నాయకులు గజమాలతో సత్కరించారు. రాష్ట్రఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, రెడ్డిరాజు, బుడ్డిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సూర్యనారాయణను సత్కరిస్తున్న సంఘీయులు

కుడుపూడికి సత్కారం

సీటీఆర్ఐ: ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావుకు ఆదివారం స్థానిక శెట్టిబలిజ సంఘం కార్యాలయంలో అభినందన సత్కారం జరిగింది. రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు నివాసానికి వచ్చిన కుడుపూడి సూర్యనారాయణరావుకు రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సత్కార సభలో పలువురు పాల్గొన్నారు. సంఘం నాయకులు శాలువాతో సూర్యనారాయణరావుని సత్కరించారు. మేడిశెట్టి తాతబ్బాయి, డాక్టర్ అనుసూరి పద్మలత, జార్జి ఆంటోని, గుమ్మడి సమర్పణరావు, కె.కె. సంజీవరావు మాట్లాడారు.

బ్రహ్మకుమారిల సేవలు అభినందనీయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రకాశం నగర్ : సమాజంలో శాంతిని నెలకొల్పాలని బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిటీఆర్ఐ రోడ్డులోని భాస్కర్‌నగర్ బ్రహ్మ కుమారిల ఆధ్యాత్మిక కేంద్రంలో శివరాత్రి వేడుకల్లో భాగంగా బ్రహ్మకుమారి గీతా మాధురి ఆధ్వర్యంలో త్రిమూర్తి శివజయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈశ్వరియా బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో ప్రతి శివరాత్రికి ఏదో ఒక కార్యక్రమం చేపట్టి ప్రజలలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలోని 17 శాఖల ద్వారా ఆధ్యాత్మికతను పెంపొందించడం కోసం నిరంతరం కృషిచేస్తున్నారని కొనియాడారు. బీకే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్ పాల్గొన్నారు.



త్రిమూర్తి శివజయంతి మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా తదితరులు

తనకు తానే గాయపర్చుకున్న వ్యక్తిపై కేసు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తనపై కొందరు వ్యక్తులు దాడి చేశారంటూ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటనగర్‌కు చెందిన మునుగొండ నాగరాజు తనకు తానే గాయపర్చుకుని తప్పుడు సంకేతాలు అందించాడని మూడో పట్టణ సీఐ మధుబాబు ఆదివారం తెలిపారు. పేపర్‌మిల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న నాగరాజు ఫోన్‌కు రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తున్నాడు. నాగరాజు లవర్ పేరు చెప్పమని అవతలి వ్యక్తి వేధిస్తున్నాడు. దీంతో నాగరాజు సదరు వ్యక్తికి ఫోన్ చేయగా అటునుంచి ఏ విధమైన సమాధానం లేదు. దీంతో నాగరాజు నువ్వు చాటింగ్ చేయడం ఆపకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటాను అని భయపెట్టాడు. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో తన మోటార్ సైకిల్‌పై ఇంటి వద్ద నుంచి బయలుదేరి మార్గం మధ్యలో బీర్ బాటిల్ కొనుక్కుని తాగాడు. తర్వాత ఆ బాటిల్‌ను పగులగొట్టి తనకు తానుగా పొట్టపై గీసుకుని, నుదుటిపై కొట్టుకున్నాడు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుంటున్నాడు. తనపై దాడి జరిగిందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. వాట్సాప్‌లో చాటింగ్ చేసిన వ్యక్తిని భయపెట్టడానికి తనకి తానుగా గాయపర్చుకుని ఆ నాటకం ఆడినట్టు తెలిసింది. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు తగిన ఆధారాలు సేకరించారు. తనకు తాను దాడి చేసుకున్న సమయంలో అతని మొబైల్‌లో తీసుకున్న సెల్ఫీ ఫొటోలు పోలీసులు సేకరించారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన శ్రీబాల త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ఆవు పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పందలపాక గౌరీశంకర ఆలయంలోను స్వామివారికి మహా రుద్రాభిషేకం చేశారు.

వైభవంగా రథోత్సవం

సీటీఆర్ఐ: ఉమా మార్కండేయేశ్వర స్వామివారి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శనివారం మహా శివరాత్రి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం నగర వీధులలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ రాగోలు శ్రీనివాసు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.



స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

శివాలయంలో ప్రత్యేక పూజలు

కడియం: స్థానిక శ్రీ భ్రమరాంబికా మల్లేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా నాల్గవ రోజైన ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, అర్చకులు మూర్తి బాలకృష్ణ శర్మ బృందం ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ, సూర్యనమస్కారాలు, రుద్రహోమం , నిత్య పరిహారం, సదస్యం, చదుర్వేద స్వస్తి నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఛత్రపతి శివాజీ జయంతి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని దోసాలమ్మ గుడిసెంటర్‌లో భారతీయ జనతా పార్టీ రూరల్ మండల యువ మోర్చా అధ్యక్షుడు మజ్జి సాయి ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకటరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ పోరాట పటిమను కార్యకర్తలకు వివరించారు. జిల్లా కార్యదర్శి తనుబుద్ది సూర్య భాస్కరరావు మాట్లాడుతూ హైందవ చైతన్యమే భారత సంక్షేమం, భారత సంక్షేమమే విశ్వ కల్యాణమనే సూక్తిని గుర్తు చేశారు. మండల అధ్యక్షుడు యానాపు ఏసు, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పొన్నాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుమలశెట్టి కుటుంబానికి జక్కంపూడి పరామర్శ

కడియం: ఇటీవల మృతి చెందిన నర్సరీ రైతు తిరుమలశెట్టి సత్యనారాయణమూర్తి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. కడియపులంకలోని వారి స్వగృహంలో సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుమారులు, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. వెంకాయమ్మపేటలో అయితరెడ్డి వెంకయ్యమ్మ, కడియపులంకలో సిద్దిరెడ్డి నర్సింగరాయుడు, రావిపాటి ఆదినారాయణ, బుర్రిలంకలో తలాటి సత్తిపండుల మృతికి జక్కంపూడి రాజా సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



సత్యనారాయణమూర్తి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి

కళాతపస్వి విగ్రహం ఏర్పాటుకు కృషి

- మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు
- ఘనంగా కళాతపస్వి విశ్వనాథ్ 93వ జయంతి



జిత్‌మోహన్‌మిత్రాను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే సూర్యప్రకాశరావు, తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాబోయే తరాలు స్మరించుకునే విధంగా కళాతపస్వి కె.విశ్వనాథ్ స్మృతిగా గోదావరి గట్టుపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆదివారం స్థానిక ఆనంరోటరీ హాల్లో జిత్‌మోహన్‌మిత్రా ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో కళాతపస్వి విశ్వనాథ్ 93వ జయంతి సందర్భంగా సంగీత విభావరి నిర్వహించారు. ముందుగా విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్యే రౌతు మాట్లాడుతూ పామరుల నుంచి పండితుల వరకు చూడదగిన, సమాజానికి ఒక సందేశాన్ని అందించే చిత్రాలను తీసిన ఏకైక దర్శకుడు కళాతపస్వి విశ్వనాథ్ అని కొనియాడారు. ఆయన తీసిన ప్రతి సినిమా ఒక ఆణిముత్యమేనన్నారు. గోదావరిగట్టుపై విశ్వనాథ్ విగ్రహం ఏర్పాటుకు జిత్‌మోహన్‌మిత్ర ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసి ముందుకువెళ్లాలని సూచించారు. నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్రా మాట్లాడుతూ కళాతపస్వి విశ్వనాథ్‌కు రాజమహేంద్రవరంతో ఎంతో అనుబంధం ఉందన్నారు. కళాతపస్వి విశ్వనాథ్ జయంతి సందర్భంగా సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. సీనియర్ జర్నలిస్ట్ సన్నిధానంశాస్త్రి, సామాజికవేత్త దేశిరెడ్డి బలరామనాయుడు, బంగారం వ్యాపారి ముద్రగడ ఏసుబాబు, నటుడు సూరిబాబు మాట్లాడారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో గాయనీగాయకులు కామేశ్వరశర్మ, టి.శ్రీనివాస్, గుంటూరు శ్రీనివాస్, గిరజాలసోమరాజునాయుడు, మంగళంపల్లి సూర్యకుమారి, వైజాగ్‌లక్ష్మి, టి.శేషగిరిరావు, సదాశివరావు, దుర్గాఫణికుమార్ కళాతపస్వి విశ్వనాథ్ చిత్రాలలోని పాటలను ఆలపించి అందరినీ అలరించారు. మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, అడబాల మరిడయ్య, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అలరించిన 'ఈ పాట మావూరి కోసం'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక విక్రమహాల్లో ఆదివారం ఘంటసాల మానవ సేవయే మాధవసేవ (పాటే ప్రాణం–సేవే మార్గం) సంస్థ ఆధ్వర్యంలో ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన 'ఈ పాట మావూరి కోసం' అలరించింది. అలనాటి పాత, కొత్త పాటలను గాయనీగాయకులు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. సంస్థ అధ్యక్షుడు యూవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, కోశాధికారి ఎస్.కృష్ణారావుతో పాటు డాక్టర్ వట్టిగంగాకిషోర్, డాక్టర్‌బోడపాటి శ్రీనివాస్, సీహెచ్‌నవీన్, అనిత, భవ్యలు పాటలను ఆలపించారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా బిల్డర్స్ అధినేత కోడేబత్తుల సత్యేంద్ర(నాని), జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబి, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ సంస్థ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.



సినీగీతం పాడుతున్న సత్యనారాయణ, అనిత

నేత్ర పర్వం.. శాంతి కల్యాణం

ద్వారకాతిరుమల: ఎక్కడా చూడని విధంగా ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు వారి దేవేరులతో ఆదివారం ఉదయం సుందరగిరిపై శాంతి కల్యాణం మహోత్సవం జరిగింది. మృత్యుంజయ సంపుటిత సుదర్శన నృసింహ ధన్వంతరి 28వ మహాయజ్ఞం ముగింపును పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్ర పర్వమైంది. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమై ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహుని ఆలయ ప్రాంగణములో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామివారికి, శివ పార్వతులకు, లక్ష్మీనారాయణులకు, మరో ఇద్దరు దేవతామూర్తులకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. రుత్వికులు, పండితులు శాస్త్రోక్తంగా ఈ కల్యాణ తంతు జరిపించారు. శనివారం సాయంత్రం ప్రారంభమైన మహాయజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ యజ్ఞం ఆదివారం తెల్లవారుజామున జరిగిన మహాపూర్ణాహుతితో ముగిసింది. అనంతరం రుత్వికులు, పండితులు సాలి గ్రామాలను అభిషేకించారు. మంగళకర శాంతి మంత్రాలతో రుద్రం, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అందులో అభిషేక జలంగా కలశ ప్రతిష్ఠలో ఉంచిన మంత్రపు జలాన్ని, కొబ్బరి నీరు వినియోగించారు. కల్యాణ తంతు అనంతరం సుమారు 50 రకాల పండ్లు, ఫలహారాలు, స్వీట్లు, పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చెర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలను సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షించారు.



హోమం నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ గురూజీ

క్రైం కార్నర్..

నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంక సమీపంలో గోదావరి నదిలో గల్లంతైన దేవరకొండ శ్రీరామ్ (19) అనే యువకుడు విగత జీవుడయ్యాడు. అతడి మృతదేహం ఆదివారం ఉదయం నదిలో లభ్యమైనట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. చాగల్లు మండలం చంద్రవరానికి చెందిన శ్రీరామ్, మల్లవరానికి చెందిన ఎస్‌కే బషీర్, మలకా ధనరాజు స్నేహితులు. ఈ ముగ్గురూ శుక్రవారం ఉదయం మద్దూరులంక గోదావరి బ్రిడ్జి వద్దకి వచ్చారు. బహిర్భూమికి వెళ్లి వస్తానని శ్రీరామ్ స్నేహితులతో చెప్పి బ్రిడ్జి దిగువకు వెళ్లాడు. కొద్ది సేపటికే అతడు గోదావరిలో గల్లంతయ్యాడు. అప్పటి నుంచీ నదిలో గాలించగా ఆదివారం అతడి మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. శ్రీరామ్ తల్లి మార్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏసీ మెకానిక్ మృతి

తాళ్లపూడి: కొవ్వూరు మండలం, చిడిపి గ్రామ శివార్లలోని మలుపు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనుకు చెందిన అడ్డగర్ల సురేష్ (30) అనే ఏసీ మెకానిక్ దుర్మరణం చెందాడు. తాళ్లపూడిలో ఏసీ వర్క్ పూర్తి చేసుకున్న సురేష్ తన మిత్రుడైన ఆడబాల సురేష్‌తో కలసి బైక్‌పై తిరిగి వెళుతున్నాడు. ఘటనా స్థలానికి వచ్చేసరికి కొవ్వూరు వైపు నుంచి వస్తున్న కారు వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అడ్డగర్ల సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ఆడబాల సురేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అడ్డగర్ల కిషోర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై వెంకటరమణ తెలిపారు.

యువతి అదృశ్యం

రాజానగరం: సీతానగరం మండలం శ్రీరామనగర్‌కి చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యమైంది. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో తండ్రి షేక్ జైన్ పోలీసులను ఆశ్రయించారు. వెలంపేటకు చెందిన మణికంఠ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదులో చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీతానగరం ఎస్సై శుభశేఖర్ తెలిపారు.